వందల్లో పెట్టుబడులు.. లక్షలు దోచేస్తారు

- పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో భారీగా మోసాలు
- సీసీఎస్ సైబర్ ఠాణాలో కేసులు నమోదు

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో ఎక్స్‌పోర్టు వ్యాపారం చేసే ఒక వ్యక్తికి సైబర్ నేరగాళ్లు రూ. 23 లక్షలు టోకరా వేశారు. రెగ్యులర్ టాస్క్, మర్చంట్ టాస్క్‌ల పేరుతో రూ. 200 నుంచి రూ. 6 వేల వరకు ముందుగా పెట్టుబడులు పెట్టించి.. లాభాలొచ్చాయంటూ నమ్మించి ఆ తరువాత నిండా ముంచేశారు. చార్మినార్ ప్రాంతానికి చెందిన బాధితుడు ఎక్స్‌పోర్టు వ్యాపారం చేస్తుంటాడు. పార్ట్‌టైమ్ జాబ్ ఉందంటూ ఈ నెల 7న వాట్సాప్‌కు ఒక మెసేజ్ వచ్చింది. గూగుల్ మ్యాప్‌కు 5 స్టార్ రేటింగ్ ఇవ్వడమే పని అని.. మీకు టెలిగ్రామ్‌లో డెమో ఇస్తామంటూ లింక్ పంపించారు. ఆ లింక్ క్లిక్ చేయగానే టెలిగ్రామ్‌లోకి వెళ్లి, మ్యాప్ రివ్యూ ఎలా చేయాలో వివరించారు. ముందుగా ఐదు రివ్యూలు చేయమని చెప్పి రూ. 200 పంపించారు. 22 టాస్క్‌లలో 17 రెగ్యులర్, 5 టాస్క్‌లు మర్చంట్‌కు సంబంధించినవి ఉంటాయని, మర్చంట్ టాస్క్‌లలో యూఎస్‌డీ ట్రేడింగ్ కూడా ఉంటుందంటూ నమ్మించారు. ఆ తరువాత మరో లింక్‌ను పంపించడంతో ఒక వెబ్‌సైట్ ఓపెన్ అయ్యింది. అందులో సైబర్‌నేరగాళ్లు చెప్పినట్లు బాధితుడు పెట్టుబడి పెడుతూ వెళ్లాడు. మొదట రెండు వేల నుంచి రూ. 12 వేల వరకు పెట్టుబడి పెట్టడంతో మీకు లాభాలొచ్చాయంటూ నమ్మిస్తూ కొంత మొత్తం బాధితుడి బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేశారు. ఆ తరువాత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టాలంటూ నమ్మించి దఫ దఫాలుగా రూ. 23.22 లక్షలు పెట్టుబడిగా పెట్టంచి నిండా ముంచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రూ. 2 పెట్టుబడిగా పెట్టమంటూ..

డి6.ఏపీకే కస్టమర్ సపోర్టు నుంచి మాట్లాడుతున్నామని.. ఇంటి నుంచే పార్ట్‌టైమ్ జాబ్ చేయవచ్చని చెప్పారు. రూ. 2 పెట్టుబడిగా పెట్టి మీ అదృష్టాన్ని పరీక్షించుకోండంటూ నమ్మించి ఓ ప్రైవేట్ ఉద్యోగి నుంచి సైబర్ నేరగాళ్లు లక్ష రూపాయలు కాజేశారు. ముషీరాబాద్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగికి గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. వాళ్లు చెప్పేది నిజమని బాధితుడు నమ్మాడు. వాళ్లు లింక్ పంపించగానే క్లిక్ చేసి, అందులో బ్యాంకు వివరాలు, పాన్‌కార్డు, ఆధార్ నంబర్‌ను అప్‌లోడ్ చేశాడు. ఆ తరువాత ర్యాపీడో యాప్‌లో రూ. 2 పెట్టుబడిగా పెట్టాలని సూచించిన నేరగాళ్లు.. లింక్ అప్‌డేట్ అవుదంటూ చెప్పారు. బాధితుడు తన బ్యాంక్ ఖాతా నుంచి రెండు రూపాయలు బదిలీ చేసేందుకు ప్రయత్నిస్తుండగానే.. ఆ ఖాతాతో పాటు మరో రెండు బ్యాంకు ఖాతాల్లో నుంచి నేరగాళ్లు దఫ దఫాలుగా రూ. 2.04 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ ఫొటో డౌన్‌లోడ్

వెబ్ అప్లికేషన్లతో మార్ఫింగ్.. ఘరానా సైబర్‌ఛీటర్ అరెస్ట్

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ ఫొటోలు డౌన్‌లోడ్ చేసి.. వాటిని మార్ఫింగ్ చేసి మహిళలను బ్లాక్‌మెయిల్ చేస్తున్న సైబర్ ఛీటర్‌ను సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. జాయింట్ సీపీ గజారావు భూపాల్ కథనం ప్రకారం.. హుస్సేనీ ఆలంకు చెందిన మనీష్ వర్మకు సోషల్ మీడియాపై అవగాహన ఉంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పబ్లిక్ వ్యూ ఉన్న మహిళా ప్రొఫైల్ ఫొటోలు డౌన్‌లోడ్ చేస్తాడు. వాటిని వివిధ వెబ్ అప్లికేషన్ల సహాయంతో మార్ఫింగ్ చేసి నగ్నంగా తయారు చేస్తాడు. ఆ తరువాత ఆ ఫొటోలను ఆయా ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఉపయోగించే వారికి పంపించి.. తనకు డబ్బులు ఇవ్వాలని లేదంటే నీ ఫొటోలను పోర్న్ సైట్స్‌లలో అప్‌లోడ్ చేస్తానంటూ బెదిరింపులకు దిగుతాడు. కొందరు బెదిరిపోయి డబ్బులిచ్చారు. మరికొందరు ధైర్యంగా వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే నగరానికి చెందిన బాధితురాలి ఫొటోను డౌన్‌లోడ్ చేసి మార్ఫింగ్ చేశాడు. ఆ ఫొటోలను ఆమె స్నేహితులు, కుటుంబ సభ్యులకు ఫేక్ అకౌంట్‌తో షేర్ చేసి.. తనకు డబ్బులివ్వాలంటూ బ్లాక్‌మెయిల్ చేశాడు. డబ్బులు ఇవ్వకపోతే పోర్న్ వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేస్తానంటూ ఆమెను మానసికంగా వేధించాడు. దీంతో బాధితురాలు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, ఇన్‌స్పెక్టర్ పద్మ నేతృత్వం లోని బృందం దర్యాప్తు జరిపి నిందితుడిని అరెస్ట్ చేసింది.

ఆరు గ్యారెంటీల పేరుతో మోసం.. ఇద్దరి అరెస్ట్

వెంగళరావునగర్, డిసెంబర్ 14: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల కార్డులంటూ అమాయక ప్రజలను నమ్మించి.. విక్రయిస్తున్న ఈ– సేవ యజమానితో పాటు మరో జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడిని ఎస్ఆర్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై రవిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల కార్డులను విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న సనత్‌నగర్‌కు చెందిన సంతోష్ తన సహచరులైన ఈరన్న, సాయికుమార్‌తో కలిసి సనత్‌నగర్ స్వామి టాకీస్ సమీపంలోని ఈ సేవ కేంద్రానికి వెళ్లాడు. అక్కడ సెంటర్ యజమాని ఒక్కొక్క కార్డుకు రూ.100 చొప్పున వసూలు చేస్తూ ఆరు గ్యారెంటీల కార్డు అంటూ విక్రయిస్తున్నాడు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలకు సంబంధించిన కార్డు జారీ చేయలేదని, అలాంటప్పుడు కార్డులు ఎలా విక్రయిస్తున్నారని సంతోష్ ఈ సేవ నిర్వాహకుడిని నిలదీశాడు. డబ్బు కోసం కార్డులు విక్రయిస్తున్నట్లు చెప్పాడు. అతడితో పాటు ఎదురుగా ఉన్న మరో జిరాక్స్ కేంద్రం నిర్వాహకుడు మహేశ్ కూడా కార్డులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సంతోష్ ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో.. ఈ సేవ, జిరాక్స్ షాపు యజమానులపై కేసు నమోదు చేసి, వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిక్కకుండా.. దొరకకుండా..

వివరాలను వెల్లడిస్తున్న సీపీ సుధీర్‌బాబు

- ఇతర కార్ల నంబర్ ప్లేట్లు.. ఫాస్ట్‌ట్యాగులు
- టోల్‌గేట్ల వద్ద పోలీసులు లేరని నిర్ధారించుకున్నాకే ప్రయాణం
- గంజాయి స్మగ్లర్ల సరికొత్త ఎత్తుగడలు
- ఏపీ టు యూపీ సరుకు రవాణా
- అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకున్న ఎల్బీనగర్ ఎస్‌ఓటీ
- కోటి రూపాయల గంజాయి స్వాధీనం

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): టోల్ ప్లాజాల వద్ద జిమ్మిక్కులు చేస్తూ ఏపీ నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌కు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి కోటి రూపాయల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. యూపీకి చెందిన వికాస్ త్యాగి, అబ్రార్, ఎండీ అమీరుద్దీన్ స్నేహితులు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గజియాబాద్‌కు చెందిన గంజాయి స్మగ్లర్‌తో ఈ ముగ్గురు స్నేహితులకు పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ నుంచి మీరట్‌కు గంజాయి తీసుకొచ్చి ఇస్తే.. మంచి కమీషన్ ఇస్తానంటూ సూచించడంతో ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో రాజమండ్రి వెళ్లేందుకు వారికి కారును అప్పగించాడు. దీంతో ముగ్గురు కారులో వెళ్లి 360 కిలోల గంజాయిని కొనుగోలుచేసి.. 72 ప్యాకెట్లలో నింపి, కారులో తెలంగాణ మీదుగా యూపీకి బయలుదేరారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్బీనగర్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ బృందం, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులతో కలిసి ఓఆర్ఆర్ వద్ద కారును ఆపి తనిఖీలు చేయగా.. అందులో 360 కిలోల గంజాయి పట్టుబడింది. గతంలో కూడా నిందితులు గంజాయి రవాణా చేసినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ మేరకు కారుతో పాటు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఓటీ ఎల్బీనగర్ డీసీపీ మురళీధర్, ఏసీపీ మట్టయ్య, అబ్దుల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ మన్‌మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టోల్ గేట్ల వద్ద తప్పించుకునేందుకు...

నిందితులు టోల్‌గేట్ల వద్దకు రాగానే అర కిలోమీటరు దూరంలోనే కారును ఆపేస్తారు. అందులో నుంచి ఒకరు దిగి పైలెట్‌గా వ్యవహరిస్తాడు. టోల్‌గేట్ వద్దకు నడుచుకుంటూ వెళ్లి.. అక్కడ ఎవరైనా పోలీసులు ఉన్నారా..? తనిఖీలు జరుగుతున్నాయా..? పరిశీలిస్తాడు. ఎవరు లేకుంటే ముందుకు వెళ్తారు. అక్కడ పోలీసులు ఉన్నట్టు తెలిస్తే వారు వెళ్లిపోయిన తరువాతే ఆ టోల్‌గేట్ దాటుతారు. నిందితుల కారు నంబర్ కూడా పోలీసుల దృష్టిలో పడకుండా ఉండేందుకు ఇతర కార్లకు సంబంధించిన నంబర్ ప్లేటు, ఫాస్ట్ ట్యాగ్‌ను వాడుతుంటారు. నిందితులు ఒక్కో చోట ఒక్కో నంబర్‌ను వాడటంతో పోలీసులు కూడా తికమక పడుతుంటారు. ఇలా జిమ్మిక్కులు చేస్తూ టోల్ గేట్ల వద్ద ఎవరికీ చిక్కకుండా పరారవుతుంటారు.

హుక్కా సెంటర్ గుట్టురట్టు

- కస్టమర్ల అవతారం ఎత్తిన పోలీసులు
- యాక్సెస్ కార్డులతో హుక్కా సెంటర్‌లోకి ప్రవేశం
- భారీ ఎత్తున సామగ్రి స్వాధీనం
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్, డిసెంబర్ 14: హుక్కా సెంటర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించి.. నలుగురిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 14లో నివాసముంటున్న జీషాన్ అహ్మద్ అలియాస్ జీషాన్(38) గతంలో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో హుక్కా సెంటర్లు నిర్వహించాడు. నగరంలో హుక్కా సెంటర్ల నిర్వహణపై నిషేధం ఉంది. దీంతో నిందితుడు రహస్యంగా తెలిసిన వారికి హుక్కా సరఫరా చేస్తున్నాడు. ఇందుకు జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లోని అస్మా ఎస్టేట్స్ భవనంలోని ఆరో అంతస్తుతో పాటు టెర్రస్‌ను అద్దెకు తీసుకున్నాడు. పోలీసులు ఎన్నికలు బందోబస్తు హడావిడిలో ఉండడాన్ని అదునుగా తీసుకున్న నిందితుడు పదిరోజుల కిందట హైదరాబాద్ టైమ్స్ కేఫ్ పేరుతో హుక్కా పార్లర్‌ను ఏర్పాటు చేశాడు. నగరంలోని యువతీ యువకులకు ఫోన్లు చేస్తూ తమకు హైకోర్టు నుంచి అనుమతి వచ్చిందని, హుక్కా సెంటర్ నడిపిస్తున్నామని చెబుతూ.. హుక్కా సరఫరా చేస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ రవీంద్రప్రసాద్, ఎస్ఐ రాకేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం రాత్రి హైదరాబాద్ టైమ్స్ కేఫ్ హుక్కా సెంటర్‌పై దాడులు నిర్వహించారు. ఆ సమయంలో సుమారు 60 మంది యువతీ యువకులు హుక్కా సేవిస్తూ పట్టుబడ్డారు. ఆర్గనైజింగ్ మేనేజర్ రియాజ్ పోలీసుల రాకను పసిగట్టి పారిపోయాడు. హుక్కా సెంటర్‌లో పనిచేస్తున్న మేనేజర్ పురాణం సాయికృష్ణ చైతన్య, రౌత్ సాయి భరత్, జనార్దన్, షాబుద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరివద్ద నుంచి 28 హుక్కా పాట్స్, 30 హుక్కా పైపులు, 150 హుక్కా ఫిల్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు జీషాన్ అహ్మద్, మేనేజర్ రియాజ్‌తో సహా నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యాక్సెస్ కార్డులతో లోనికి ప్రవేశం..

పోలీసులు వచ్చి తనిఖీలు నిర్వహించేందుకు వీలు లేకుండా నిందితుడు అస్మా ఎస్టేట్స్ భవనంలోని లిఫ్ట్‌ను యాప్ ద్వారా బ్లాక్ చేయడంతో పాటు కేవలం తెలిసిన వారు మాత్రమే లోనికి వచ్చేలా యాక్సెస్ కార్డును గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండే సిబ్బంది వద్ద ఉంచాడు. యాక్సెస్ కార్డుతో లిఫ్ట్ ఆరో అంతస్తుకు వెళ్లేలా ఏర్పాటు చేశాడు. లిఫ్ట్ తప్ప ఇతర మార్గాలన్నీ మూసేయించారు. బుధవారం రాత్రి పోలీసులు హుక్కాసెంటర్‌పై దాడి చేసేందుకు కస్టమర్ల అవతారంలో లోనికి ప్రవేశించాల్సి వచ్చింది. గతంలో ఈ హుక్కా సెంటర్‌లో హుక్కా సేవించిన యువకుడితో కలిసి ఇద్దరు పోలీసులు లోనికి ప్రవేశించారు. అక్కడున్న యువతీ యువకులు అవాక్కయ్యారు. చాకచక్యంగా హుక్కా సెంటర్‌లోకి ప్రవేశించి దాడులు నిర్వహించిన జూబ్లీహిల్స్ ఎస్ఐ రాకేశ్‌తో పాటు ఇతర అధికారులను వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్ అభినందించారు.

జూబ్లీహిల్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న హుక్కా సామగ్రిని పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్,ఏసీపీ హరిప్రసాద్ తదితరులు

గ్యాస్ పైప్‌లైన్ లీకేజీతో..

- కరాచీ బేకరీ గోదాంలో మంటలు
- 15 మంది కార్మికులకు గాయాలు..
- గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో ఘటన

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 14 : గ్యాస్ పైప్‌లైన్ లీకేజీతో కరాచీ బేకరీ గోదాంలో మంటలు చెలరేగి కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో ఉన్న కరాచీ బేకరీ గోదాంలో గురువారం ఉదయం డ్యూటీకి వచ్చిన కార్మికులు బిస్కెట్లు, కేక్‌లు తయారు చేసే క్రమంలో గ్యాస్ లీకైంది. గ్యాస్‌స్టవ్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడ పని చేస్తున్న 15 మంది కార్మికులకు గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు, సిబ్బంది కలిసి గాయపడిన వారిని వాహనాల్లో శంషాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. దీంతోపాటు కార్మికులు 100కు కాల్ చేసి జరిగిన ప్రమాదంపై సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని పరిశీలించారు. ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. గోదాం యాజమాన్యంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన కార్మికులను..

ఈ ప్రమాదంలో గాయపడిన కార్మికులను కాంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఓ అపోలో దవాఖానకు తరలించారు.చికిత్స పొందుతున్న కార్మికుల్లో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్టు పోలీసులు తెలిపారు. గాయపడిన కార్మికులు బలరామ్, శుభం ప్రజాపతి, ఆదిత్యకుమార్, సందీప్ ప్రజాప్రతి, దీపక్‌శుక్లా, అమ్రేశ్ కుమార్, ముఖేశ్ కుమార్, ధారా సింగ్, సోను, కమల్‌కిశోర్, ప్రమోద్‌కుమార్, సందీప్‌కుమార్, సన్నీ, ప్రదీప్, సుజిత్ ఉన్నారు. వీరంతా ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారుగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు.

ఔటర్‌పై ప్రమాదం.. ఒకరి మృతి

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 14 : ఔటర్‌రింగ్ రోడ్డుపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. శంషాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్ కథనం ప్రకారం.. గుమ్మడివెలి గ్రామానికి చెందిన ఎండీ మహ్మద్ అపర్ణ ఎంటర్ ప్రైజెస్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం కాంక్రీట్ మిషన్‌కు టూషన్ కట్టుకొని.. కంపెనీలో పని చేస్తున్న నాలుగురు కార్మికులను డీసీఎంలో తీసుకొని తుక్కుగూడ నుంచి ఔటర్‌రింగ్ రోడ్డు మీదుగా శంషాబాద్ వైపు వస్తున్నాడు. పెద్దగోల్కొండ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన డీసీఎం వీరి వాహనాలను ఢీ కొట్టడంతో రెండు వాహనాలు బోల్తాపడ్డాయి. ప్రమాదంలో సూరజ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సూపరింటెండింగ్ ఇంజినీర్, సికింద్రాబాద్ జోన్. GHMC

'ఇ'-ప్రాక్యూర్‌మెంట్ ప్రకటన

Short NIT No. 38/SE(M)/Sec-bad Zone/GHMC/2023-24, తేది: 14.12.2023. క్ర.సం.: 1. **NIT No.** 38/SE(M)/Sec-bad Zone/GHMC/2023-24, తేది: 14.12.2023. **పనుల సంఖ్య:** 24 పనులు. **మొత్తం 24 పనులు. అంచనా మొత్తం (రూ. లక్షలలో): రూ. 2414.40.** బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది/చివరి తేది & సమయం: బిడ్ దాఖలు ప్రారంభ తేది & సమయం: 15.12.2023న సా॥ 04.00 గం. బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం: 22.12.2023న సా॥ 04.00 గం. **అధికారి పేరు & చిరునామా & సెల్ నెం:** SE, సికింద్రాబాద్ జోన్, GHMC, సెల్ నెం. 9989930374. తదుపరి వివరాలను **https://www.tender.telangana.gov.in**లో చూడవచ్చును.
DIPR RO.No. 8668-PP/CL/ADVT/1/2023-24, Dt: 14-12-2023 సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, సికింద్రాబాద్ జోన్, GHMC.